విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 18, నవంబర్ 2024

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన ..

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని కోన రోడ్డులో నీ శ్రీ వివేకానంద హై స్కూల్లో నిర్వహించిన శస్త్ర చికిత్స వైద్య శిబిరానికి ఆదివారం విశేష స్పందన లభించింది. మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ మరియు వేదుకాపుర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 103 మంది హాజరై నవారికి మాతృశ్రీ హాస్పిటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు.. మాతృశ్రీ హాస్పిటల్ వైద్యులు ప్రశాంత్ రెడ్డి స్త్రీల వ్యాధి నిపుణులు గైనకాలజిస్ట్ వైద్యులు లలిత దేవి పేషెంట్లను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శ్రీ వివేకానంద హై స్కూల్ యాజమాన్యానికి శిబిరాన్ని నిర్వహించుకోవడానికి సహకరించినందుకు మాతృశ్రీ హాస్పిటల్ వారు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో గుత్తి మాత శ్రీ హాస్పిటల్ మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది రాజేష్, ప్రసన్నకుమార్, సురేష్, విజయలక్ష్మి, యశోద, యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ మరియు వేదుకాపుర ఫౌండేషన్ సభ్యులు బందారు బాలకృష్ణ, ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి, చింతా నరసింహ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: దేశంలో నానాటికి పెరుగుతున్న నిరుద్యోగ సమస్యలు పరిష్కరించుకోవాలంటే కార్పొరేట్ సభ్యులకు వ్యతిరేకంగా మతోన్మాద బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం మండలంలోని నవయుగ కాలనీలో అఖిల భారత యువజన సమాఖ్య జెండా స్థూపాన్ని ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సనాతన ధర్మం పేరుతో హిందూ ముస్లిం మైనార్టీల మధ్య గొడవలు సృష్టించే కుట్ర కోణం జరుగుతుందని లౌక్య వ్యవస్థ పరిరక్షణకు అన్ని మతాల సమానత్వాలకి లేదు యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా మతోన్మాద బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రాబోవు రోజుల్లో సమైక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాయల సీమ జిల్లాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి ఇక్కడ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే నూతన పారిశ్రామిక విధానం అవసరమని కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర రాయల సీమ సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వారు చిన్న వయసులోనే ఉరికమ్మ మెక్కారని వారు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన ధైర్యాన్ని గుర్తు చేశారు. నరేంద్ర మోడీ చంద్రబాబు నాయుడు కార్పొరేట్ యాజమాన్యలకు వంతు పాడుతున్నారని అంబానీ ఆధారిలకు లక్షల కోట్లు రుణమాఫీలు చేస్తున్నా రని అయితే రైతులకు మాత్రం మొండి చేయి చూపిస్తు న్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్రంలో కమ్యూనిస్టు సభ్యులు లేని చట్టసభలను చూస్తే జాలి వేస్తుందని పేద ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అక్కడ చర్చలు జరగడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ ఆవేదన చెందారు. విశాఖ ఉక్కు కడప ఉక్కు ఫ్యాక్టరీలను తీసుకు రావడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయా లని జాఫర్ డిమాందు చేశారు. జిల్లాలోని రైతాంగం కరువు బారిన పడితే కరువు మండలాలకు గుర్తించలేని దీనస్థితి లో ప్రభుత్వాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. రాబోవు రోజుల్లో కమ్యూనిస్టు పార్టీలు చట్టసభల్లో అడుగు పెట్టాలంటే ఐక్య ఉద్యమాలు తప్పనిసరిఅని గుర్తు చేశారు. జిల్లా ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కనకదాస రాష్ట్రస్థాయి జయంతోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం: ఈనెల 18వ తేదీన సోమవారం నిర్వహించే కనకదాస రాష్ట్రస్థాయి జయంతోత్సవం కార్యక్రమం నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సంచాలకులు మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.ఏ.మల్లికార్జున కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఈనెల 18వ తేదీన నిర్వహించే కనకదాస రాష్ట్రస్థాయి జయంతోత్సవం సందర్భంగా అనంతపురం నగరంలోని గుత్తి రోడ్ లో ఉన్న కె.టి.ఆర్ కన్వెన్షన్ హాల్లో కార్యక్రమం సంబంధిత ఏర్పాట్లను రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సంచాలకులు మేనేజింగ్ డైరెక్టర్, కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంతోత్సవం కోసం ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పెద్దఎత్తున ప్రజలు పాల్గొంటారని, రాష్ట్రస్థాయి జయంతోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. కె.టి.ఆర్ కన్వెన్షన్ హాల్లో డయాస్ పైన వీఐపీల సీటింగ్ ఏర్పాట్లు, ప్రసంగాల ఏర్పాటు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. వీఐపీలు వచ్చి వెళ్లేచోట అవసరమైన భద్రత ఉండాలన్నారు. హాల్లో అవసరమైన ఎల్ఈడి స్క్రీన్స్ ఏర్పాటు చేయాలన్నారు. డిఆర్డిఏ, మెప్మా పీడీలు మండలాల్లో అవగాహన నిర్వహించి కార్యక్రమానికి ప్రజలను తరలిం చేలా చూడాలన్నారు. కార్యక్రమానికి వచ్చే వారికి తాగునీరు అందించాలని, భోజన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే వారికి పార్కింగ్ ఏర్పాట్లు సజావుగా చేయాలని తహసీల్దార్కు సూచించారు. సంబంధిత అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు.

పేదలకు గ్రామాల్లో 3సెంటు ఇవ్వాలి

విశాలాంధ్ర-కూడేరు: పేదలకు ఇళ్ల స్థలాలు ఇల్లు నిర్వాణం కోసం సీపీఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 18 తేదీన సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల వద్ద పేదలతో వ్యక్తిగత అర్జీలు అందించే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మండల కేంద్రంలోని విఘ్నేశ్వర కాలనీలో ఆదివారం సిపిఐ నాయకులు ఆదివారం ఇంటింటికి తిరుగుతూ పర్యటించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో 3 సెంట్లు పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి బి కేశవ రెడ్డి లు డిమాండ్ చేశారు. ఈ నెల 18 న సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు లో పేదల తో కలిసి ఇళ్ల స్థలాలకు వ్యక్తిగత అర్జీలను 18 వ తేదీ గ్రామ వార్డ్ సచివాలయాల్లో అందించాలని కోరారు. చంద్రబాబు నాయుడు అధికారం లోకి వచ్చి 5 నెలలు పూర్తి కావస్తున్నప్పటికి ఇళ్ల స్థలాలు గురించి మాట్లాడటం లేదన్నారు. ఇప్పటికి గ్రామాల్లో, పట్టణాల్లో ఇళ్ల స్థలాలు లేని పేదలు కోకొల్లలుగా వున్నారనిల. సిపిఐ మండల కార్యదర్శి నారాయణమ్మ.ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్ గారు.అన్నారు. కూడేరులో ఈ కార్యక్రమంలో వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి బి.కేశవరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి నారాయణమ్మ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సిపిఐ కుడేరు మండలం ఇంచార్జి పార్వతి ప్రసాద్, సిపిఐ సీనియర్ నాయకులు రమణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకర్మ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెరుగు సంగప్ప, నియోజకవర్గ అధ్యక్షులు మల రాయుడు, రైతు సంఘం నాయకులు ప్రసాద్, మహిళా సమాఖ్య నాయకులు వరలక్ష్మి, లతా, వెంకటలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర-శింగనమల: మండల పరిధిలోని కళ్ళుమడి గ్రామంలో శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బందారు శ్రావణీ శ్రీ ఆదేశాలతో టీడీపీ నాయకులు గ్రామంలో అభివృద్ధికి రూ.10 లక్షల సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కే.ఓబిరెడ్డి, పెద్ద నటరాజు, ఓబుల రాజు, సెకరప్ప, మల్లికార్జున, శంకర జయరామ్, సురేశ్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

రజక సంఘం డైరెక్టర్‌కు సన్మానం

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని రజక సంఘం కార్యాలయం వద్ద ఆదివారం రజక సంఘం నాయకులు ఆదివారం రజక సంఘం డైరెక్టర్ రామాంజనేయులుకి అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. రజక సంఘం డైరెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ నాపై నమ్మకంతో అవకాశం కల్పించిన పెద్దలు నిర్ణయించిన ప్రకారం వెనుకబాటుకు గురైన రజక సమాజానికి తోడుగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో గుజారి సుబ్బరాయుడు, నాగరాజు, ఎల్లనూరు శ్రీను, నాగ మునయ్య, రామకృష్ణ, బాలిల్లు సుబ్బరాయుడు, రవి, గంగాధర, శ్రీనివాసులు రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తులసీ దామోదర కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ఆత్మకూరు: పంపనూరు ఆలయంలో కార్తీక మాసం మూడవ ఆదివారము జరిగిన కోటి దీపోత్సవం, శ్రీ తులసి దామోదర కళ్యాణం కళ్యాణంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. ఏటా కార్తీక మాసం మూడవ ఆదివారం ఆలయంలో శ్రీ తులసీ దామోదర కళ్యాణం కోటి దీపోత్సవం నిర్వహించడం మానవైతిగా వస్తోంది. కార్యక్రమంలో ఆర్‌డిఓ కేశవ నాయుడు, డిఎల్‌డివో సుమన జయంతి, ఎంపీడీవో జి లక్ష్మీనరసింహ, తహసిల్దార్ లక్ష్మీ నాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఈఓఆర్డి కామాక్షి, శైలజరాణి, ఆనంద్, సదాశివ, కార్యదర్శులు మహబూబ్ భాష, శిరీష, మూకాంబికసాంబ పాల్గొన్నారు.

సేవకు గుర్తింపుగా డాక్టరేట్ ...

విశాలాంధ్ర-అనంతపురం రూరల్ : ప్రముఖ న్యాయవేత్త సామాజిక కార్యకర్త దీపక్ దయానందన్ తన అద్భుతమైన సేవలకు గుర్తింపుగా అమెరికన్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. పేదల సంక్షేమం కోసం నిరంతర కృషి చేస్తున్న దీపక్ దయానందన్, 2008 నుండి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న దీపక్, తన చట్టపరమైన జ్ఞానాన్ని సామాజిక కోరికను కలిపి అనేక మంది జీవితాలను మార్చారు. విద్యా ప్రోత్సాహం, అణగారిన వర్గాలకు న్యాయ సహాయం వంటి వివిధ సామాజిక చొరవలకు నాయకత్వం వహిస్తున్నారు. బాస్ ఫౌండేషన్ ద్వారా పేదరిక నిర్మూలన, యువత సాధికారత, ఆరోగ్య సంరక్షణ వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. "మానవ సేవ మాధవ సేవ" అనే నమ్మకంతో తన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీపక్‌కు ఈ అవార్డు లభించడం ఆయన కృషికి ఒక గుర్తింపు .

ఆటో డ్రైవర్‌కి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : మండలంలోని ఓబులాపురం చెక్ పోస్ట్ సమీపంలో మంగళూరు నుండి బళ్లారికి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మరియు బళ్లారి నుండి ఓబుళాపురం వైపు వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కి తీవ్ర రక్త గాయాలు కాగా, బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆటోలో డ్రైవర్ మాత్రమే వున్నాడు డ్రైవర్ మారెన్న(40) కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ కో కన్వీనర్ల ఎన్నిక ..

విశాలాంధ్ర-జెఎన్టియుఏ : ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా గర్ల్స్ సమావేశం నీలం రాజశేఖర్ రెడ్డి భవనం లో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్‌గా రాధా జ్యోతి, కో కన్వీనర్లుగా సాయిస్వరూప శృతి ఎన్నిక ఎన్నుకున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శృతి సభ్యులుగా శృతి, వెన్నెల, అను, మంజుల, రోజా, రమ్యశ్రీ, చందన, మమత త్రివేణి, ఎన్నుకున్నట్లు చెప్పారు. రాధా జ్యోతి సాయిస్వరూప శృతి మాట్లా డుతూ.. దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని పోరాడిన విద్యార్థి సంఘంలో కన్వీనర్‌గా కో కన్వీనర్‌గా పని చేయడానికి అవకాశం కల్పించినందుకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపైన జిల్లాలో విద్యార్థినులను ఏకం చేసి ఉద్యమి స్తామని పేర్కొన్నారు. మహిళలపైన చిన్నారులపైన హత్యాచారాలు మానభం గాలు చేస్తున్న వారిపైన కఠినం గా శిక్షలు అమలు చేసి ఇంకొకసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని తెలిపారు. జిల్లాలో ఏఐఎస్ఎఫ్ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ జిల్లా సహాయ కార్యదర్శి చందు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంజు ఉమా మహేష్ నగర నాయకులు తారక్ పాల్గొన్నారు.

నిరంతర వైద్య విద్య సదస్సులే పరిశోధనలకు పునాది

విశాలాంధ్ర-అనంతపురం: ప్రభుత్వ వైద్య కళాశాలలోని పెథాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో చర్మవ్యాధి శాస్త్ర సమగ్ర విశ్లేషణ పై నిరంతర వైద్య విద్య సదస్సును సుశ్రుత సెమినార్ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్ మాణిక్యరావు హాజరయ్యారు. చర్మానికి వచ్చే వ్యాధులు, పెథాలజీలో వాటి వ్యాధి శాస్త్రంపై సమగ్ర విశ్లేషణ చేయడానికి ముఖ్య వక్తలుగా విశ్వభారతి మెడికల్ కాలేజ్ పేథాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ మైరెడ్డి నీరజ, సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజ్ చర్మ వ్యాధి శాస్త్ర ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ రాజలక్ష్మి, పి ఈ ఎస్ మెడికల్ కళాశాల కుప్పం పెతాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ ఏఎస్ రామస్వామి, శాంతి రామ్ మెడికల్ కళాశాల పేథాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ జానకి వివిధ రకాల అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విపులంగా వివరించారు. జోనల్ కోఆర్డినేటర్ గా నంద్యాల మెడికల్ కళాశాల పెతాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ బాలేశ్వరి, అబ్జర్వర్‌గా డెర్మటాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ కిషోర్ వ్యవహరించారు. ప్రభుత్వ వైద్య కళాశాల పెథాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య శివ శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్రం లోని వివిధ వైద్య కళాశాలల నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్‌మాణిక్యరావు మాట్లాడుతూ నిరంతర వైద్య విద్య సదస్సులతోనే పరిశోధనలకు పునాది పడుతుందని, క్రమం తప్పకుండా ప్రతి విభాగం వైద్యులు నిరంతర వైద్య విద్యా సదస్సులు నిర్వహించనుండడం ద్వారా ఇక్కడ చదువుతున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు ప్రపంచస్థాయి వైద్య విజ్ఞానం చేరువవుతుందని తెలిపారు.

పట్టణాలలో 2 సెంట్లు పల్లెల్లో 3 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలి

విశాలాంధ్ర-పుట్లూరు: తక్కల్లపల్లి గ్రామంలో ఇల్లు లేని నిరు పేదలున్నారని, అర్హులైన వారికందరికీ ప్రభుత్వం మూడు సెంట్ల స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల కేటాయించాలని సిపిఐ పుట్లూరు మండల కార్యదర్శి పెద్దయ్య తక్కల్లపల్లి గ్రామంలో ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకుంటున్నాడు, అనంతరం ఆయన మాట్లాడుతూ నవంబర్ 18 వ తేదీన సచివాలయాల వద్ద అర్జీల సమర్పణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పుట్లూరు మండలం తక్కళ్ళపల్లి గ్రామంలో ఇల్లు స్థలాలు లేని వారికి వ్యక్తిగత అర్జీలు స్వీకరిస్తున్నానన్నారు, అమ్మాయి సెల్‌తో కూడిన హారాన్ని సచివాలయాధికారులకు సమర్పిస్తున్నామని, ఈ కార్యక్ర మానికి పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ కార్యకర్తలు వ్య.కా.సం నియోజకవర్గ అధ్యక్షుదుసి,పెద్ది రాజు, తక్కల్లపల్లి సిపిఐ పార్టీ శాఖ కార్యదర్శి బాలు, పెద్దన్న, శివ, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర-బెలుగుప్ప: ఎదురెదుగా వస్తున్న రెండు మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో ఆమిదాల గ్రామానికి చెందిన అక్కులప్ప అజయ్‌లు బెలుగుప్ప మండల కేంద్రం నుంచి గుండ్లపల్లి మీదుగా రాయదుర్గం వెళుతుండగా ప్రమాదం జరిగింది. బెలుగుప్ప మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొని గాయపడ్డారు. ఈ సంఘటనలో అక్కులప్ప తలకి తీవ్ర గాయాలు కాగా కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బెలుగుప్ప పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అహుడా చైర్మన్ వరుణ్‌ను సన్మానించిన తోట ఓబులేసు

విశాలాంధ్ర-శింగనమల: అహుడ చైర్మన్ టిసి వరుణ్‌ని జనసేన పార్టీ శింగనమల మండలాధ్యక్షులు తోట ఓబులేసు యువ నాయకులు రామమోహన్ ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో జనసేన పార్టీకి దశాబ్ద కాలంగా సుదీర్ఘ సేవలు అందించిన టీ.సీ వరుణ్ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు అహుడా చైర్మెన్‌గా నియమితులైన శుభ సందర్భంగా అనంతపురం నగరంలోని రాంనగర్ ఆఫీస్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. జనసేన పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసినందుకు పార్టీ అధిష్టానం గుర్తింపునిచ్చిందన్నారు.

హెూరాహెూరిగా రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో గజగౌరీ దేవి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెూరా హెూరిగా రాతిదూలం లాగుడు పోటీలను ఉద్దేహాళ్ గ్రామ పెద్దలు, యూత్ నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలను పూజలు నిర్వహించి పోటిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా 10 జతల వృషభాలు ఈ రాతిదూలం లాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. అందులో మొదటి బహుమతి కింద ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన చెన్నప్ప వృషభాలు 8200 అడుగులు లాగి మొదటి బహుమతి రూ. 25వేలు గెలుచుకున్నాయి. బళ్లారి జిల్లా ఆంధ్రాలో గ్రామానికి చెందిన ఆనంద్ రెడ్డి వృషభాలు 7.200అడుగులు లాగి రెండో బహుమతి రూ.20వేలు గెలుచుకున్నాయి. తోపుదత్తి గ్రామానికి చెందిన చెన్నప్ప వృషభాలు 6.480అడుగులు లాగి మూడో బహుమతి రూ. 15వేలు గెలుచుకున్నాయి. ఉద్దెహాళ్ లింగదళ్ గ్రామానికి చెందిన బసప్ప వీరేష్ వృషభాలు 6.000 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ. 10వేలు గెలుచుకున్నాయి. ఉరవకొండ గ్రామానికి చెందిన నిశాల్ వృషభాలు 5.560అడుగులు లాగి ఐదవ బహుమతి రూ.5 వేలు గెలుచుకున్నాయి. బహుమతులను గ్రామస్తులు టిడిపి నాయకులు కొత్తపల్లి మల్లికార్జున, దుర్గ ప్రసాద్, నవీన్ ,సంగప్ప, సైకిల్ షాప్ హనుమంతు, కృష్ణాపురం శీనా, మల్లీ దు శ్రీనివాసులు, కోటిరెడ్డి, తదితరులు బహుమతులు అందజేశారు.

ఓపెన్ డ్రింకింగ్‌పై చర్యలు తీసుకోండి : ఎస్పీ

విశాలాంధ్ర-అనంతపురం: ప్రజలకు అసౌకర్యం కల్గించే ఓపెన్ డ్రింకింగ్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని ఎట్టి పరిస్థితులలోను ఉపేక్షించేది లేదన్నారు. బహిరంగంగా మద్యం సేవించడం నిషేధమన్నారు. చట్టరీత్యా నేరమన్నారు. ప్రజాజీవనానికి ఆటంకం కలిగించే తాగుబోతులను అదుపులోకి తీసుకుని వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. రోడ్లు, నడక దారులు, పార్కులు, వ్యాపార దుకాణ సముదాయాలు, శివారు ప్రాంతాలు మరియు వల్నరబుల్ ఏరియాలలో ప్రత్యేక దాడులు నిర్వహించి పబ్లిక్ న్యూసెన్స్ కింద చర్యలు తీసుకోవాలన్నారు.

చంద్రబాబు పాలనలో సీమకు అన్యాయం

- అనంతపురానికి రావాల్సిన ఎయిమ్స్‌ను మంగళగిరికి తరలించారు
- హంద్రీనీవా సామర్థ్యం 6200 క్యూసెక్కులకు పెంచాలి
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత

విశాలాంధ్ర-అనంతపురం రూరల్ : వెనుకబడిన రాయలసీమకు చంద్రబాబు అన్యాయం చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. కర్నూలులో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను తరలించాలనుకోవడం తగదన్నారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాయలసీమకు అన్యాయమే జరుగుతోందని , రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి కేంద్రం ఎయిమ్స్ కేటాయిస్తే దాన్ని అనంతపురంలో ఏర్పాటు చేస్తామని చెప్పి మంగళగిరికి తీసుకెళ్లారని మండిపడ్డారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ చంద్రబాబు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గతంలో హంద్రీనీవాను శంకుస్థాపనలకే పరిమితం చేశారని, కరువు ప్రాంతమైన రాయలసీమలో హంద్రీనీవా ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లను పట్టిసీమకు రాత్రికి రాత్రే తరలించిన ఘనత కూడా చంద్రబాబుదేనని గుర్తు చేశారు. హంద్రీనీవా సామర్థ్యం 3850 క్యూసెక్కులు ఉంటే 2200 క్యూసెక్కులే వస్తున్నాయని, 6200 క్యూసెక్కుల సామర్థ్యానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే జీవో జారీ చేశారని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం లో మళ్లీ 3850 క్యూసెక్కులకే పరిమితం చేస్తున్నా రని తెలిపారు. ఈ విషయంపై ఆర్థికశాఖ మంత్రి పయ్యా వుల కేశవ్‌తోనూ చర్చించినట్లు చెప్పారు. హంద్రీనీవా సామర్థ్యం 6200 క్యూసెక్కులకు విస్తరిస్తేనే రాయలసీమకు ప్రయోజన కరమని తెలిపారు. సమావేశంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాకే చంద్రశేఖర్, వైసీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్టలో ఎంపీ

విశాలాంధ్ర-అనంతపురం బ్యూరో : అనంతపురం జిల్లా వజ్రకరూర్ మండలం, పందికుంట గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గుమ్మనూరు నారాయణ స్వామి, ప్రతాప్ నాయుడు, రాయంపల్లి నాగరాజు. ఆమిదాల మారెప్ప మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, రామకృష్ణ, శివశంకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర-శెట్టూరు: మండలంలో క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరు కూడా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ తరుణ్ సాయి అన్నారు. ఆదివారం చెర్లోపల్లి, అయ్యగార్లపల్లి చిన్నంపల్లి, బొచ్చుపల్లి, కైరేవు గ్రామంలో క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తూ పరీక్షలు నిర్వహించి పోస్టర్లను కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంట్లో 18 సంవత్సరాలు పైబడిన వారికి నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌తో పాటు బీపీ,షుగర్,టీవీ, కుష్టి పరీక్షలు చేసి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అఖిల, మౌనిక, శిరీష,అంజలి, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనంతో ప్రాచీన కథలు గుర్తుకు

విశాలాంధ్ర-రాప్తాడు: కవి సమ్మేళనంతో ప్రాచీన కథలు గుర్తుకు తెచ్చుకుని పూర్వ కవుల గురించి తెలుసుకోవచ్చని లైబ్రేరియన్ వీరనారాయణరెడ్డి అన్నారు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుదు పి.లక్ష్మయ్య మాట్లాడుతూ నిత్యజీవితంలో గ్రంథాలయాల పాత్ర గురించి, మహా కవులు శ్రీకృష్ణ దేవరాయల అస్థానకవులు, అష్టదిగ్గజ కవులు అల్లసాని పెద్దన, మను చరిత్ర, తిమ్మన్న, పింగళి సూరన, వసుచరిత్ర, తెనాలి రామకృష్ణుడు మొదలగు కవుల గురించి వివరించి వారి కృషిని కొనియాడారు తెలుగు ఉపాధ్యాయుదు లక్ష్మన్నను సన్మానించారు. ఉపాధ్యాయులు జి.శ్రీహరి, పి.సాయిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సమాచార వనరులకు కేంద్రాలు

విశాలాంధ్ర-ఉరవకొండ: గ్రంథాలయాలు సమాచార వనరులకు కేంద్రంగా ఉన్నాయని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు గోపాల్, ఉరవకొండ గ్రంథాలయ అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకత గురించి స్థానిక గ్రంథాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక ఇన్ఫర్మేషన్ సెంటర్స్ అని వాటిని వినియోగించుకొని విద్యార్థులు గ్రూప్ 2 ఐఏఎస్ ఐపీఎస్ మొదలగు కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు హాజరవుటకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

పిల్లాడి నడుములోని కట్టె తొలగింపు

విశాలాంధ్ర-కణేకల్లు: కనేకల్ రాంనగర్ వీధిలో ఉన్న ఇర్ఫాన్ 12 సంవత్సరాల పిల్లాడి నడుములో చొచ్చుక్కుపోయిన కట్టెను కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సత్ర చికిత్స ద్వారా తీసివేశారు. కనేకల్ రాంనగర్ నందు ఉన్న ఇర్ఫాన్ జిల్లా పాఠశాలలోని ఆరో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సెలవు కావడంతో ఇర్ఫాన్ తన స్నేహితులతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో వెలగ పండ్ల కోసం అని వెళ్లి చెట్టు పైకి ఎక్కి అక్కడ నుంచి అదుపుతప్పి క్రిందకు పడడంతో అక్కడ ఉన్న ఒక ఎండిన కట్టే ఆ బాలుడి నడుములోకి చొచ్చుకుపోయింది,.. కుటుంబం సభ్యులు వెంటనే కనేకల్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రతిమ చికిత్స చేసి కర్నూల్ ఆసుపత్రికి రెఫర్ చేశ్యారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్య బృందం శనివారం శస్త్ర చికిత్స చేసి ఇరుపాన్ నడుమ దగ్గర ఉన్న కట్టే ముక్కను ఆపరేషన్ చేసి ఆ కట్టె ముక్కను తొలగించారు.

ఆలయ పునః నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: పట్టణంలోని బి.ఆర్ అంబేద్కర్ నగర్‌లో పురాతన దేవాలయం శ్రీ మైలార లింగస్వామి పునః నిర్మాణానికి ఆదివారం అర్చకులు మంత్రోచ్చారణలతో ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు తనయుడు కాలువ భరత్ చేతులు మీదుగా భూమి పూజ నిర్వహించారు. గణాచార్యులు, గోరవయ్యల నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు వసుపులేటి రాజు, బంగి శంకర్, సిమెంట్ సీనా, ఎస్సీ మల్లి, మాజీ కౌన్సిలర్ మల్లక్క వైయస్సార్ కౌన్సిలర్లు వన్నూరు స్వామి, శారదమ్మ,లు పాల్గొన్నారు. సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సొంత నిధులతో లక్షలాది రూపాయలతో దేవాలయ నిర్మాణం చేపడుతున్నట్లు దాతలు, సహకారాలు అందించాలని వారు కోరారు.

టిడిపి నాయకుడిని పరామర్శ

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువు కు చెందిన టిడిపి పుట్టపర్తి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు గాజుల చంద్రమోహన్ను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పరామర్శించారు. అనారోగ్యానికి గురై వైద్య చికిత్సలు చేయించుకుని తన స్వగృహంలో ఉండగా ఆయన ఆదివారం ఇంటి వద్దకు వెళ్లి ఆయనను కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు,టిడిపి నాయకులు రెడ్డి శ్రీరాములు , సైకిల్ షాప్ బాబా,జనసేన నాయకుడు గాజుల నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి : సిపిఐ డిమాండ్..

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: సూర్య పత్రిక విలేకరి పై దుర్భసలాడిన హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణ ను వెంటనే సస్పెండ్ చేయాలని పుట్టపర్తి నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఆంజినేయులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం సిపిఐ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గం కార్యదర్శి ఆంజనే యులు, మండల కార్యదర్శి చలపతి నాయుడు, రైతు సంఘం జిల్లా నాయకులు పూల శ్రీనివాసులు, మండల సిపిఐ సహాయ కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ వార్డెన్ లక్ష్మీనారాయణ ఎక్కడ విధులు నిర్వహించిన విద్యార్థులకు పొట్టకొట్టడం, అవినీతి అక్రమాలకు పాల్పడం జరుగుతుందన్నారు. ఇటీవల గౌనిపల్లి హాస్టల్ వార్డెన్ ఇన్చార్జిగా విధులు నిర్వహించిన సందర్భంలోను

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టట్లేదని విద్యార్థులు రోడ్లెక్కిన సందర్భం లేకపోలేదన్నారు. విషయం రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం వెళ్లిందన్నారు. దీంతో వార్డెన్ ను అక్కడ్నుంచి అధికారులు బదిలీ చేశారని గుర్తు చేశారు. విద్యార్థులు, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్ పై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం

విశాలాంధ్ర-అమరాపురం : అమరాపురం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు. ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవంలో భాగంగా ఆదివారం శాఖ గ్రంథాలయం అమరాపురంలో కవుల సమ్మేళనాలను సెమినార్లు చర్చలు నిర్వహించారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రానికి చెందిన నన్నయ, తిక్కన, ఎర్రన, వదలగు రచయితల గురించి వారి యొక్క సందేశాలను విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ

కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి అయిన ఇబ్రహీం నేతృత్వంలో యోగ మాస్టర్ కిషోర్, మహంతేష్ పాల్గొన్నారు.

భక్త కనకదాస జయంతికి కలసికట్టుగా తరలిరావాలి

.. మంత్రి సవితమ్మ పిలుపు

విశాలాంధ్ర-పెనుకొండ: భక్త కనకదాస జయంతికి కలసికట్టుగా తరలిరావాలని మంత్రి సవితమ్మ పిలుపు నిచ్చారు. పెనుకొండ టీడీపీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర బీసీ చేనేత శాఖ మంత్రి సవితమ్మ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ 18వ తేదీ సోమవారం అనంతపురంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్ నందు కురుబ కులస్తుల కుల దైవమైనటువంటి శ్రీ భక్త కనకదాస 537 వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వము అధికారికంగా నిర్వహిస్తున్నందున ఈ కార్యక్రమానికి కురుబ కులస్తులు మరియు ఇతరులు విరివిగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమానికి కురుబ కులానికి సంబంధించిన ప్రజా ప్రతినిధులు ఎంపీ పార్థసారథి, కర్నూలు ఎంపీ నాగ రాజు, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, ఇతర నాయకులు ఎమ్మెల్యేలు ఎంపీలు అధికారులు కలెక్టరు, బీసీ సంక్షేమ అధికారులు, ఈ కార్యక్రమంలో పాల్గొని జయంతిని అధికారిక పూర్వకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

కురుబ కుల పెద్దపరసలో పాల్గొన్న మంత్రి సవితమ్మ

విశాలాంధ్ర-పెనుకొండ: హనుమప్ప పల్లి గ్రామం వద్ద శ్రీ తాళికేరప్ప స్వామి,ఉజ్జినప్ప స్వామి, పెద్దపరుష మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ పాల్గొన్నారు. కురుబ కుల దేవాలయ స్వాములవారి ప్రతిమలను గతి రెండు రోజుల నుంచి గ్రామంలో ఊరేగించి ప్రజలకు దర్శనం కల్పించారు, అలాగే పెద్ద పరుస సందర్భంగా అనేకమంది గుడికట్ల పూజారులు మరియు స్వాములవారి గోత్రము కలవారు వచ్చి విశేష పూజలు చేయించి నూతన వస్త్రాలు ధరింప చేశారు, మంత్రి సవితమ్మ వారి పుట్టింటి వారికి బంధువులకు నూతన వస్త్రాలను అందజేశారు, ఇంటి ఆడబిడ్డ మంత్రి సవితమ్మకు కూడా అందరూ నూతన వస్త్రాలు ఇచ్చారు, స్వాముల ఎదుట గురవయ్యలు నృత్యాలు నాట్యాలు నిర్వహించారు, ఈ పెద్ద పరస కార్యక్రమంలో వచ్చినటువంటి కుల బంధువులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, కురుబ కులస్తులు, స్థానిక నాయకులు, సర్పంచ్ శ్రీనివాసులు, పూజారి అక్కులప్ప, రిటైర్డ్ ఆర్డిఓ కిష్టప్ప, ఎంపీడీవో నరేష్ కృష్ణ, న్యాయవాది పద్మ నారాయణరెడ్డి, నాగరాజు రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి..

విశాలాంధ్ర-ధర్మవరం: ఆశా వర్కర్స్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం కలెక్టరేట్ ఆఫీస్ వద్ద జరుగు ఆశా వర్కర్ల ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు జెవి. రమణ, సిపిఎం నాయకులు అయూబ్ ఖాన్, ఇర్ఫాన, నారాయణమ్మ తెలిపారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఆశ రిజిస్టర్లు ప్రభుత్వమే ఇవ్వాలని, ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదని, ఆశా వర్కర్ల నియామకంలో రాజకీయ జోక్యం ఉండరాదని, సెలవులు, ప్రమోషన్లు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ జీవోను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. కనీస వేతనం అమలు చేయాలని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఏఎన్ఎం పోస్టుల భర్తీలు, ఆశా వర్కర్లకు వెయిటేజ్ ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ జీవో ఇవ్వాలని, వేతనముతో కూడిన ప్రసూతి సెలవుల జీవోలు విడుద చేయాలని వారు తెలిపారు. ఈ డిమాండ్ పరిష్కారానికై జరగబోయే ధర్నాకు ప్రతి ఒక్క ఆశవర్కర్ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వ్యాసరచన పోటీలో ప్రతిభ..

విశాలాంధ్ర-ధర్మవరం: భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి 99వ జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా పట్టణంలోని కాగితాల వీధిలో గల శ్రీ ప్రణవ సాయి

ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఇటీవల నిర్వహించగా పట్టణంలోని 24 పాఠశాలల నుండి 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా ఐదు జూనియర్ కళాశాల నుండి నూరు మంది రెండు డిగ్రీ కళాశాల నుండి 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రణవ సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుండి టి.మమతారెడ్డి ప్రథమ బహుమతి గెలుపొందారని జిల్లా జాయింట్ బాలవికాస్ కోఆర్డినేటర్ కరణం ఆదిలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాల నుండి షేక్ పర్వీన్ తాజ్ ద్వితీయ బహుమతిని, పద్మావతి డిగ్రీ కళాశాల నుండి టీ. అర్పియా ద్వితీయ బహుమతిని గెలుపొందడం జరిగిందని తెలిపారు. త్వరలో వీరందరికీ పుట్టపర్తిలో బహుమతులను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మితో పాటు శ్రీ సత్యసాయి సేవా సమితి తరపున జాయింట్ కన్వీనర్ శేషాచారి,కన్వీనర్ నామ ప్రసాద్, జనార్ధన్, ప్రథమ, ద్వితీయ పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సభ్యత్వ నమోదును వేగంగా చేపట్టండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు కార్యకర్తలు వేగవంతంగా నిర్వహించాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం కొత్త చెరువులో మరువ ఆంజనేయస్వామి సమీపంలోని కాలనీలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 రూపాయలు సభ్యత్వం చెల్లిస్తే ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు సైకిల్ షాప్ బాబా, నల్లమాడ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వస్త్ర దానం

విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్: మండల పరిధిలోని కొడికొండ పంచలింగేశ్వర ఆలయంలో ఆదివారం తల్లిదండ్రులు నాగరత్నమ్మ నారెప్ప గుడిబండవాసులు వీరి జ్ఞాపకార్థం కుమారులు ఎస్ఎన్ శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం కోడలు చంద్రకళ, లీలావతిలు పేదలకు వస్త్ర దానం చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా తల్లిదండ్రులు జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం కార్తీక మాసం సందర్భంగా వస్త్ర దానం మహిళలకు బెడ్ షీట్, చీర, పురుషులకు బెడ్ షీట్ పంచే, పంపిణీ చేశారు ఈ నేపథ్యంలో కొడికొండ మొరంపల్లి దిగుపల్లి తండా ప్రజలు దాదాపు 5000 మంది దాకా హాజరయ్యారు, వస్త్రదానంతో పాటు లడ్డు ప్రసాదం పంపిణీ చేశారు. ఎల్లవేళలా వారి తల్లిదండ్రుల ఆశీస్సులు కలగాలని దీవెనలు చేశారు ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, స్థానికులు హరినాథ్ రెడ్డి అశ్వత్తప్ప, చంద్రనాయక్ పాల్గొన్నారు.

నేడు లక్షదీపోత్సవం..

విశాలాంధ్ర-రొళ్ల: మండలంలోని పురాతన చారిత్రక ఆధ్యాత్మిక మహాక్షేత్రమైన రత్నగిరి గ్రామం కోటలో వెలసిన శ్రీ కాళికాంబ కమటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం నాలుగవ సంవత్సరం సందర్భంగా లక్షదీపోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.సోమవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు,హోమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నారు. అనంతరం 3-30 గంటల నుండి రత్నగిరి రాజువీధుల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఊరేగింపు నిర్వాహించి సాయంత్రం శ్రీ కాళికాంబ కమటేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో లక్షదీపోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కావలసిన ప్రమిదలు,నూనె,వత్తులు భక్తుల సహకారంతో సమకూర్చి ఉన్నామని ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపాలను వెలిగించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సూచించారు. అనంతరం రాత్రికి ఆలయ ఆవరణంలో భక్తులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. లక్షదీపోత్సవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు.

సత్యసాయి బాబా జయంతిపై కళాకారుల ప్రచారం

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : పుట్టపర్తి భగవాన్ సత్య సాయి బాబా 99వ జయంతిని జయప్రదం చేయాలంటూ గౌరాపురం కళాకారులు ఆదివారం మండలంలో విస్తృత ప్రచారం చేశారు. ప్రచార రథం ముందు గౌరాపురం భజన మండలి, కోలాటం సభ్యులు సత్య సాయి బాబా భక్తి పాటలు ఆలపిస్తూ ఉత్సాహంగా కోలాటాలు వేశారు. సత్యసాయి బాబా జయంతి వేడుకలకు తరలి రావాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళల కోలాటాలు ఆకట్టుకున్నాయి.

క్షుద్ర పూజలు చేసిన వైసీపీ నాయకునిపై చర్యలు తీసుకోవాలి ..

విశాలాంధ్ర-కదిరి: క్షుద్ర పూజలు చేసి అడ్డంగా దొరికిపోయిన వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డిపై కదిరి టిడిపి నాయకులు ఫైర్ అయ్యారు. అడ్డదారిలో అక్రమంగా సంపాదించడం వైసిపి నాయకులకు వెన్నతో పెట్టిన విద్యని చేసిన తప్పును ఒప్పుకోకుండా టిడిపి నాయకులపై బురద చల్లడం మంచి పద్ధతి కాదని హితువు పలికారు. అర్ధరాత్రి సమయంలో వైసీపీ నాయకులు క్షుద్ర పూజలు చేయడాన్ని టిడిపి నాయకులు తీవ్రస్థాయిలో తప్పుపట్టారు. పోలీస్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వైసిపి నాయకుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైమండ్ ఇర్ఫాన్ టిడిపి పట్టణ అధ్యక్షులు కదిరి,రాజశేఖర్ బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు. కృపేంద్ర రెడ్డి, శేషు, తదితర తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీరామప్ప ఇంటి గృహప్రవేశానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ క్రమంలో నవగ్రహ పూజలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, మడకశిర ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి, తిమ్మాలాపురం భీమరాజు, లక్ష్మీనరసప్ప, లాయర్ శివకుమార్, మాజీ ఎంపీటీసీ క్రిష్టప్ప, మడకశిర ఏరియా కోఆర్డినేటర్ ఎస్.ఆర్. నాగరాజు మైనార్టీ నాయకుడు షబ్బీర్ పాల్గొన్నారు.



మడకశిర కాంగ్రెస్ సమన్వయకర్తగా కరికెర సుధాకర్

విశాలాంధ్ర-గుడిబండ: మడకశిర నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ను కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. ఈయన 2009 లో మడకశిర ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి,రోశయ్య, నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, ముగ్గురు ముఖ్యమంత్రులతో ఎమ్మెల్యేగా పనిచేశారు.మాజీ మంత్రి సిడబ్ల్యూసి సభ్యులు నీలకంఠాపురం రఘువీరారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పుట్టపర్తి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల కరికెర సుధాకర్‌ను మడకశిర సమన్వయకర్తగా నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. మాజీ ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

గృహప్రవేశ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు

విశాలాంధ్ర-నంబులపూలకుంట: ఎదురుదోన పంచాయతీ సిద్ద వాండ్ల పల్లి గ్రామంలో వెంకట రమణ నూతనంగా నిర్మించిన గృహప్రవేశ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు ఆవుల బాలక్రిష్ణ నాయుడు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీకి చెందిన పార్టీ నాయకులు,కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కార్యకర్తలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోమిరెడ్డి,వెంకటరామిరెడ్డి,శేఖర్ నాయుడు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

విశాలాంధ్ర-బుక్కపట్నం: మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త తలమర్ల శేఖర్ తల్లి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదివారం అక్కడికి విచ్చేసి కుటుంబాన్నిపరామర్శించి,, మృతురాలు భౌతికాయనికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బాధలో ఉన్న ఆ కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఆహర్నిశలు కృషి చేస్తానని ఆపద సమయంలో కార్యకర్తలు అండగా ఉంటానని తెలిపారు. అనంతరం కొంత ఆర్థిక సాయం అందించారు

భక్త కనకదాస జీవిత చరిత కవిత ఓ అద్భుతం

విశాలాంధ్ర-రొళ్ల: మండలం రత్నగిరి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కే.హరిప్రసాద్ భక్త కనకదాస జీవిత చరిత్రను కవిత రూపంలో స్వీయ రచన చేసి గానం చేసి అందరిని అలరిస్తున్నారని వారికి ఈ పాట అంకితం చేస్తున్నాని తెలిపారు.సోమవారం అనంతపురం నగరంలో జరిగే భక్త కనకదాసు జయంతి సందర్భంగా ఈ పాటను అయన స్వయాన రచన చేసి ప్రజలకు అందించారు. ఓ కనకదాసుడా...అంటూ అయన పాట రూపంలో వివరించారు. కనకదాసు కలలు కన్నా సమ సమాజమే రావాలన్నా...సమ సమాజమే రావాలన్నా... అంటూ హరి ప్రసాద్ రచించిన శ్రీ శ్రీ శ్రీ భక్తకనకదాసు జీవిత చరిత్ర కవితగా పాటగా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలుస్తోందని హరిప్రసాద్ గారికి జన్మనిచ్చిన తల్లిదండ్రులు స్వర్గీయ లక్ష్మీదేవమ్మ దేవత ఆశీస్సులు అందిస్తుంటే నాన్నగారు జి.నంజప్ప కళ్ళ ఎదురుగా ఆశీర్వాద వచనాలు పలికారు అంటూ హరిప్రసాద్ తెలిపారు..

చట్ట పరిధిలోనే గ్రామ ప్రజలు జీవించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: చట్ట పరిధిలోనే గ్రామ ప్రజలు జీవించాలని, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకున్నప్పుడే మంచి జీవితం లభిస్తుందని రూరల్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు జిల్లా ఎస్పీ, డి.ఎస్.పి, రూరల్ సీఐ ఆదేశాల మేరకు ప్రతిరోజు ఓ గ్రామంలో గ్రామ సభను నిర్వహించి, చట్టాలపై అవగాహన నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే మండల పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పేకాటకు దూరంగా ఉండాలని, మద్యానికి బానిస కాకూడదని తెలిపారు. తదుపరి సైబర్ క్రైమ్ పైన రోడ్డు సేఫ్టీ పైన కూడా అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. చిన్నచిన్న గొడవలకు పోరాదని, పోలీస్ స్టేషన్లు చుట్టూ కోర్టులు చుట్టూ తిరిగితే సమయం వృధా అవుతుందని, సమన్వయంతో ఆలోచనతో నిర్వహిస్తే అంతా సుఖప్రదం అవుతుందని తెలిపారు. అంతేకాకుండా నాటుసారా కాచడం, అసాంఘిక కార్యకలాపాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. బాల్య వివాహాలు చేయరాదని, బాలికలు ఉన్నత స్థాయి వరకు చదివించే ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తుందని, ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు వస్తే నిగా ఉంచి మా పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని తెలిపారు. గ్రామ ప్రజలందరూ సమన్వయంతో ఐక్యమత్యంతో మెలిగినప్పుడే గ్రామాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

కార్పెంటర్స్, పెయింటర్స్ సమస్యల పరిష్కారమే మా లక్ష్యం...

విశాలాంధ్ర-ధర్మవరం: కార్పెంటర్స్ అండ్ పెయింటర్స్ సమస్యల పరిష్కారమే మా లక్ష్యము అని నూతన కమిటీ వారు పేర్కొన్నారు. ఆదివారం కార్పెంటర్స్, పెయింటర్స్ యూనియన్ పెద్దలను కలిసి సమావేశం

నిర్వహించారు. ఈ సమావేశంలో సమస్యలపై తీవ్రంగా చర్చించి సమస్యల పరిష్కారానికి ఐక్యమత్యంతోనే మార్గం సుగమం అవుతుందని తెలిపారు. తదుపరి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ నూతన కమిటీలో కార్పెంటర్ అధ్యక్షులుగా కే. శివ, ప్రధాన కార్యదర్శిగా కే.నంజుండ చారి, పెయింటర్ అధ్యక్షుడుగా గద్దం రాజు, కోశాధికారిగా సాయిరాజును ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. పట్టణంలో ఏ సమస్య అయినా ఎదురైనప్పుడు కలిసికట్టుగా చర్చించి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమన్మయంతో, ఐక్యమత్యంతో ముందుకు వెళ్లాలని తెలిపారు.

మాలదారులకు భోజన వితరణ ఎంతో తృప్తిని ఇచ్చింది..

విశాలాంధ్ర-ధర్మవరం: మాలధారణ భక్తులకు భోజన వితరణ చేయడం నాకెంతో తృప్తిని సంతోషాన్ని ఇచ్చిందని బిజెపి నాయకుడు డోలా రాజారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆశీస్సులతో తాను ఈ భోజన వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని సాయి నగర్ (పుట్టపర్తి రోడ్డు)లోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఈనెల 17వ తేదీ నుండి 41 రోజులు దీక్ష బూనిన మాల ధారణ భక్తాదులకు ప్రతిరోజు మధ్యాహ్నం భోజన పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మాలదారులు సద్వినియోగం చేసుకుని తమ ఆశీస్సులను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో షిరిడి సాయిబాబా కమిటీ అధ్యక్షులు వీరనారాయణ, ఉపాధ్యక్షులు సీసీ. నారాయణరెడ్డి, కోశాధికారి సూర్యనారాయణ, డైరెక్టర్ సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఒక మంచి నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరం

విశాలాంధ్ర-ధర్మవరం: చంద్రగిరి మాజీ శాసనసభ్యుడు తెలుగుదేశం పార్టీ నాయకుడు నారా రామ్మూర్తి నాయుడు ఆకస్మిక మృతి దురదృష్టకరమని, పార్టీకి తీరని నష్టమని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణ టీడీపీ కార్యాలయంలో నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ పార్టీ తీవ్ర సంక్షోభంలో ఉన్న సమయంలో నారా చంద్రబాబు నాయుడు, నారా రామ్మూర్తి నాయుడు కృష్ణ, అర్జునలులా తెలుగుదేశం పార్టీని ముందుండి నడిపించారని తెలిపారు. నారా రామ్మూర్తి నాయుడు చంద్రగిరి శాసన సభ్యునిగా ఉన్న సమయంలో చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలు టీడీపీ ఎన్నటికీ మరువదని తెలిపారు. అనంతరం నారా రామ్మూర్తి నాయుడు కుటుంబానికి భగవంతుడు మనో నిబ్బరాన్ని ప్రసాదించాలని టీడీపీ నాయకులు ఆకాంక్షించారు.

ఘనంగా కవి సమ్మేళనం



విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక గంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం ఘనంగా గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి, పాఠకులు విద్యార్థుల నడుమ నిర్వహించారు. పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన గ్రంథాలయ శాఖలో ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాన్ని వారు నిర్వహిస్తున్నారు. 4వరోజు గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కవి జే.నాగరాజు హాజరయ్యారు. అనంతరం గ్రంథాలయం గురించి పద్యం రూపంలో పాఠకులకు, విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు కూడా ఈ కవి సమ్మేళనంలో పాల్గొని తమదైన శైలిలో కవిత్వమును పాడారు. వక్తృత్వపు లో చంద్ర యాన్ టు గురించి వివరించామని తెలిపారు. వకృత్వపు పోటీల్లో 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శివమ్మ, రమణ నాయక్, గంగాధర్, కవులు, పాఠకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఉస్సేన్

విశాలాంధ్ర-కదిరి: వాతావరణం మార్పుల వల్ల కలిగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డా. ఉస్సేన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన దగ్గు, జలుబు, పడిశం, వైరల్ జ్వరాలతో కూడిన ఒళ్ళు నొప్పులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం వలన వీటి నుండి రక్షణ పొందవచ్చు అన్నారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగడంతో పాటు, వేడి పదార్థాలను మాత్రమే భుజించాలి అన్నారు. చల్లని నీళ్ల, పానీయాలు, చల్లని తిండి పదార్థాలు తీసుకోవడం తగ్గించాలన్నారు. వీటితోపాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వాతావరణ మార్పుల వలన కలిగే రుగ్మతల నుండి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. రుగ్మతలు ప్రబలిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు.



మహర్షి వాల్మీకిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-అమరాపురం: హాలుకూరు గ్రామం నందు ప్రతిష్టించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకి సోదరులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెదేపా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విచ్చేశారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి, అమరాపురం మండల కన్వీనర్ ఎన్ గణేష్, మాజీ జెడ్పిటిసి కేఎస్ఎమ్ నరసింహమూర్తి, మాజీమండల కన్వీనర్ ఎల్ శివరుద్రప్ప, తెలుగు యువత. మద్దనకుంట రఘు, లెజెండ్ నాగరాజు వీరితోపాటు వాల్మీకి కుటుంబం నాయకులు వీరితో కలిసి మహర్షి వాల్మీకి విగ్రహానికి పూల మాలవేసి విశేష పూజలను నిర్వహించారు. గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ దేశానికి కాకుండా ప్రపంచానికి దిశా నిర్దేశంగా రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి ఆశయాలను అనుగుణంగా కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా వాల్మీకి కులస్తులను దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్పించడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని వాల్మీకి కుటుంబాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వార్డ్ మెంబర్ లెజెండ్ నాగరాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాధిక వైన్స్ ప్రసాద్. బాటా నాగరాజ్ యాదవ్, యేగేష్,అగ్రహారం నవీన్, డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, అమరాపురంమైనార్టీ దాదు, అమరాపురం మండల్ ఎస్సీసెల్ అధ్యక్షుడు చెన్నప్ప, పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం..

విశాలాంధ్ర-రొద్దం: స్థానిక గ్రంథాలయలో 5 57వ జాతీయ గ్రంథాల వారోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం తెలుగు ఉపాధ్యాయులైన గంగాధర ఆధ్వర్యంలో తిక్కన, పోతన, ఎర్ర ప్రగడ తెలుగు కవుల రచయితల వారు రచించిన గ్రంథాలు పుస్తకాలు పాఠ్యాంశాల గురించి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాల అధికారి నాగరాజు, షేక్షావలి విద్యార్థులు పాల్గొన్నారు.

పదిలో పాసైన విద్యార్థులకు చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - హిందూపురం : శ్రీ సత్య సాయి, అనంతపురం ఉమ్మడి జిల్లాలో భట్రాజు కులానికి చెందిన, పదవ తరగతిలో 550 మార్కులు పైబడి వచ్చిన విద్యార్థుల పేరెంట్స్ కు, భట్రాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూరపాటి రామరాజు, వైస్ చైర్మన్ చక్రాల ఫకీర్ రాజు, ట్రెజరర్ వర్ణకవి రాఘవ రాజు వారి ఆదేశాల మేరకు, శ్రీ సత్య సాయి అనంతపురం జిల్లా భట్రాజు చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ ఆర్. రంగనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పెద్దలు ఆనందరాజు, సూర్యనారాయణ రాజు, అనసూయమ్మ, వసుంధరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ వర్కింగ్ జర్నలిస్టుల సమావేశం

విశాలాంధ్ర-పెనుకోండ: పెనుకొండలోని ఆదివారం రహదారులు భవనాలు అతిథి గృహం నందు నియోజకవర్గ వర్కింగ్ జర్నలిస్టులు సమావేశం అయ్యారు, పెనుకోండ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నికకు సంబంధించి పలు విషయాలు చర్చించారు, ఏపీ యు డబ్ల్యూ జే జిల్లా అధ్యక్షులు పుల్లయ్య,ఉపాధ్యక్షులు బీరే ఈశ్వరయ్య సమక్షంలో ఈ ఎన్నికలు జరుగుతాయని, చిన్న,పెద్ద పత్రికలు,ఛానళ్ళు అని తేడా లేకుండా,సమాజంలో కష్టపడి పని చేస్తున్న ప్రతి వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్,ఇంటి స్థలం మరియు తమ పిల్లలకు ప్రవేటు పాఠశాలలో 50% ఫీజు రాయితి లకు ఈ కమిటి కృషి చేస్తుందని,ప్రతి వర్కింగ్ జర్నలిస్ట్ కు ఏ సమస్య వచ్చిన ఈ కమిటీ అండగా ఉంటుందని, అందు కోసమే ఈ కమిటి ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 26న ఉదయం 10:00 గంటలకు పెనుకొండలోని రహదారులు భవనాలుగెస్ట్ హౌస్‌లో, జిల్లా అధ్యక్షులు పుల్లయ్య సమక్షంలో ఈ ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు బిరే ఈశ్వరయ్య.. ప్రతి వర్కింగ్ జర్నలిస్ట్ ఈ ఎన్నికలకు హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

శుద్ధ జలం అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర-రామగిరి: మండలంలోని నసనకోట గ్రామ ప్రజలకు శుద్ధ జలం అందించడమే లక్ష్యమని మాజీ జెడ్పిటీసీ రామ్మూర్తి నాయుడు అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఏర్పాటు చేసిన శ్రీ వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హెచ్.లలితమ్మ, వైస్ సర్పంచ్ జె.గంగాధర్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 18, నవంబర్ 2024

వ్యవసాయమా... మేము పిల్లనివ్వం

యువ వ్యవసాయదారులకు పెళ్లిళ్లు కష్టమేనా..
రాబోయే కాలంలోనైనా రైతన్నను గుర్తించేరా..

విశాలాంధ్ర - చిలమత్తూర్ రూరల్ : పూర్వకాలంలో వ్యవసాయం చేసేవారు చెడిపోరన్నది ఒకప్పటి మాట, ప్రస్తుత కాలం పంటలు పండించేవారు చెడిపోతున్నారన్నది నేటి మాట, గత పూర్వకాలం వ్యవసాయమే రైతులకు ఆధారం, నేడు ఎవరి నైనా వ్యవసాయం చేస్తారా అని ప్రశ్నిస్తే చేయమని ముఖం మీదే చెప్పేస్తారు, గతంలో పంట పొలాలు గడ్డివాములు పశువుల గోదాములు,ఎరువు దిబ్బలు పరిశీలించి పిల్లను ఇచ్చేందుకు ఆసక్తిగా ముందుకు వచ్చేవారు, ప్రస్తుతం అది పూర్తిగా మారిపోయింది వ్యవసాయ యువ రైతులు పెళ్లి సంబంధాలు చూడడానికి వెళితే నీవు ఏం చేస్తావు అంటూ ప్రశ్నిస్తారు తాను మంచి వ్యవసాయ దారుడు అంటే పిల్లను ఇచ్చేందుకు ముఖం చాటేస్తూ అయితే మళ్లీ ఫోన్ చేస్తాము అంటూ సమాధానం వస్తుంది దీంతో యువ రైతులు పెళ్లి కాక వ్యవసాయాన్ని చేయలేక పొట్ట చేత పట్టుకొని చిన్నచిన్న ఉద్యోగాల కోసం వలస వెళ్లే దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సమాజంలో దాదాపు రైతులు వ్యవసాయం చేయడానికి ఇష్టపడడం లేదని తెలుస్తుంది పట్టణాలలో ఏదైనా పరిశ్రమలో చిన్న ఉద్యోగం ఉంటే చాలు కాళ్లు కడిగి పిల్లను ఇచ్చి పెళ్లి చేస్తారు ఎంత పెద్ద వ్యవసాయ దారుడైన సరే పిల్లను ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో వందలాదిమంది యువ రైతులు ఇప్పటికీ చిరంజీవులుగా మారిపోతూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే వ్యవసాయం ఎటు పోతుంది పట్టెడు అన్నం పెట్టే రైతన్న ఏమి కావాలి వ్యవసాయ ఉత్పత్తు లు ఎలా ప్రజలకు అందాలి అన్న ప్రశ్నలు మేధావుల్లో తలెత్తుతున్నాయి. వ్యవసాయం ఉద్యోగముగా మారాలంటే ప్రభుత్వాలు రైతన్నకు చేయూతనిచ్చి రైతును రాజుగా మార్చే వైపు అడుగులు వేయాల్సి ఉంది. రైతే రాజు దేశానికి వెన్నెముక లాంటివాడు రైతు అంటూ ప్రభుత్వాలు అంటున్నాయే కానీ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రభుత్వాల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి అని తెలుస్తుంది. రైతు చెమటోడ్చి పండించిన పంటకు సరైన ధర దేవుడెరుగు కనీసం మద్దతు ధర కూడా లేదు. దీనికి తోడు తెగుళ్లు, ప్రకృతి వైపరీ త్యాలుతో రైతులు అప్పుల్లో చిక్కుకొని ఆత్మహత్యలు చేసుకుం టున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో దాదాపు వేరుశెనగ పంట తగ్గిపోయింది, ఎటు చూసినా బీడులుగా దర్శనమిస్తున్నాయి అతివృష్టి అనావృష్టి వల్ల పెట్టిన పెట్టుబడి చేతికందక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు బంగారు నగలు తాకట్టు పెట్టి కాడెద్దులు తెగ నమ్ముకొని దళారుల వద్ద అప్పులు చేసి అవస్థలు పడుతు న్నారు. ఒకప్పుడు బాగా బ్రతికిన కుటుంబాలు స్థానికంగా కూలి పనులు చేయలేక మనసు రాక పట్టణాలకు వలస వెళ్లి కూలి పనులు చేసు కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయ తీలలో ఆర్బికేలు ద్వారా విత్తనాలు ఎరువులు పెట్టుబడి సాయం అందించేవారు. కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం క్రింద రూ 20 వేలు ఇస్తామని చెప్పిన మాటలను నిలబెట్టుకో వాలని ఇప్పటికే సిపిఐ పార్టీ తరఫున రైతు సంఘం నాయకులు నియోజక వర్గ వ్యాప్తంగా అధికారులకు వినతి పత్రాలు అందించారు. ఖరీఫ్ సీజన్ పూర్తి అవుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సహాయం అందకపోవడంతో పల్లెలు కాళీ అయిపోతా యేమో అనిపిస్తుంది ఇలాంటి పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో ఏ విధంగా రైతన్నలు బతికీడుస్తారో వేచి చూడాల్సిందే. రాబోయే కాలానికైనా రైతే రాజు, రైతే దేశానికి వెన్నెముక లాంటివాడు అవుతాడేమో వేచి చూద్దాం.

మహిళలను కించపరిచన వారిపై కేసు పెట్టడం హర్షణీయం

విశాలాంధ్ర-కదిరి: వైసిపి అధినేత ప్రోత్సాహంతో మహిళలను కించపరుస్తూ పోస్ట్ లు పెట్టిన సైకో సోషియల్ మీడియా వారిపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం హర్షణీయమని జనసేనా ఇంచార్జ్ భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,నారా లోకేష్ కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన పోస్టు పెడుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝులిపిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రజలు హర్షిస్తున్నారన్నారు.దీన్ని సహించని వైఎస్ఆర్సీపీ నాయకులు అసత్యాలను ప్రచారం చేస్తూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని దాన్ని కప్పి పుచ్చుకోవడం కోసం వైఎస్ఆర్సీపీ పార్టీ నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారనే విషయాలను ఖండించారు. జగన్ రెడ్డి తన పెయిడ్ సోషియల్ మీడియాను అడ్డు పెట్టుకొని సొంత చెల్లి ,తల్లిపై అసభ్యకరమైన పోస్టలు పెట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోటీ పడాలి తప్ప రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులపై పోస్ట్ పెట్టడం సభ్య సమాజానికి సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ లోపాలు ఉంటే వ్యక్తిత్వ హననం చేయకుండా సహేతుకంగా విమర్శ చెస్తే సరిదిద్దు కుంటామని అలా కాకుండా కుటుంబ సభ్యుల పైన అసభ్యకరంగా నీచాతి నీచంగా బూతులు తిడుతూ పెట్టడం సరి కాదని హితువు పలికారు.ఈ కార్యక్రమంలో బ్లూమూన్ శివశంకర్ , చలపతి,చిన్నపరెడ్డి,కుటాల లక్ష్మణ,రమణ,రాజేంద్ర ప్రసాద్, చౌదరి, కేవీ రమణ, రవీంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-తాడిపత్రి : పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరు గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కర్నూలు శాంతిరాం కంటి హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పెద్దపప్పూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె.మాధవయ్య తాడిపత్రి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల కోసం కంటి పరీక్షలు చేసి, వైద్యం అందించడానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేసి, ఈ శిబిరంలో దాదాపు 85 మంది కంటి పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు చేసిన వారిలో దాదాపు 27 మందికి కర్నూలు శాంతిరాం కంటి హాస్పిటల్ వారు బస్సు సౌకర్యం కల్పించి, ఉచితంగా కంటి చికిత్సలు చేయించి, వారిని మరల చిన్నపప్పూరు గ్రామంలోని వదులుతారని చెప్పారు. ఈ శిబిరంలో హాజరైన వారందరికీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంబర్స్ రాజా నాయుడు, నాగేశ్వర్ రెడ్డి, అనురాధ, వాణి, శివారెడ్డి వైద్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువు కు చెందిన టిడిపి పుట్టపర్తి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు గాజుల చంద్రమోహన్ను, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పరామర్శించారు. అనారోగ్యానికి గురై వైద్య చికిత్సలు చేయించుకుని తన స్వగృహంలో ఉండగా ఆయన ఆదివారం ఇంటి వద్దకు వెళ్లి ఆయనను కుటుంబ సభ్యులను పరామర్శించి అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తగా వైద్యుత్ చికిత్సలు అందించుకోవాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారికి సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు,టిడిపి నాయకులు రెడ్డి శ్రీరాములు , సైకిల్ షాప్ బాబా,జనసేన నాయకుడు గాజుల నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

57వ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: స్థానిక మండల కేంద్రంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా కవి సమ్మేళనమును ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా తెలుగు లెక్చరర్ శానవాజ్ ఖాన్ మాట్లాడుతూ పుస్తక పఠనం యొక్క ప్రముఖ్యత గ్రంథాలయాల పాత్ర గురించి మహ కవుల శ్రీకృష్ణ దేవరాయల అస్థానకవులు,అష్టదిగ్గజ కవులు అల్లసాని పెద్దన్నమను చరిత్ర,తిమ్మన్న,పింగళి సురన, వసుచరిత్ర,తెనాలి రామకృష్ణుడు మొదలగు కవుల గురించి తెలుపుతూ వారి కృషిని కొనియాడారు అనంతరం విధ్యార్థులు గ్రంథాలయములను సందర్శించి విజ్ఞాన సమాపార్జున చేయాలని సుచించారు చివరగాకవిసమ్మేళనకార్యక్రమంలో ప్రవేట్ కాలేజ్ లెక్చరర్ సోమశేఖర్ రమేష్ విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు ప్రజలు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత నమోదు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో 6, 7,8, వ వార్డులలో దర్గా పేట నందు టీడీపీ మైనార్టీ నాయకుడు నదీముల్లా (దాదు) ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని అందరితోనూ 100 రూపాయల సభ్యత్వ రుసుముతో సభ్యత్వాన్ని చేస్తున్నారు. ఈ వంద రూపాయలు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం వలన ఐదు లక్షల వరకు ప్రమాద బీమా ఇతర సౌకర్యాలు మరియు వాటి వలన కలిగే ప్రయోజనాలు వారికి తెలియజేస్తూ సభ్యత నమోదు కార్యక్రమాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు.

అయ్యప్పలకు అన్నదాన వితరణ

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని ఎర్రమంచి గ్రామ పంచాయతీ, జాతీయ రహదారి 44 , ప్రక్కన దుద్దేబండ క్రాస్ నందు గల శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం నాడు తెలంగాణ రాష్ట్రం నుండి శబరిమలకు పాదయాత్ర ద్వారా వెళ్ళే అయ్యప్ప స్వాములు స్నానం ఆచరించి ఆలయంలో అయ్యప్ప స్వామి పడిపూజ, భజనలు, కీర్తనలు నిర్వహించి, మహా ప్రసాదం భుజించి విశ్రాంతి తీసుకున్నారు.దాతల సహకరిస్తే మరింత భోజన , నీటి వసతులు కల్పిస్తామని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ ధర్మకర్త గుర్రప్పస్వామి తెలియజేశారు.

నామకరణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం శేషాపురం గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు అరుణ్ రెడ్డి, కుమారుడు నామకరణ మహోత్సవం పెనుకొండలోని ఐముక్తేశ్వర స్వామి దేవాలయంలో హాజరైన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత శాఖ సవితమ్మతో పాటుగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణ సేవలో అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ : పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర నారాయణ సేవలో భాగంగా ఆదివారం సంతకు వచ్చిన యాచకులకు, పేదలకు, వివిధ గ్రామస్తులకు సుమారు 200 మందికి అన్నదానం, త్రాగునీరు అందజేశామని ఈ కార్యక్రమనికి దాతల సహకారంతో చేసినామ ఈ కార్యక్రమానికి సహకరించిన వారికి వారి కుటుంబ సభ్యులకు మరియు సేవలో పాల్గొన్న వారికి అందరికీ భగవాన్ బాబా వారి యొక్క అనుగ్రహ ఆశీస్సులు ఉంటాయని సత్యసాయి తాలూకా సేవా సమితి అధ్యక్షులు శంకర్ తెలిపారు.

రాయలసీమలో తొలిసారిగా "లంగ్ టాక్స్"

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం: రాయలసీమ ప్రాంతంలో తొలిసారిగా ఊపిరితిత్తుల సమస్యలపై వైద్యనిపుణుల్లో అవగాహన కోసం "లంగ్ టాక్స్" అనే సదస్సును నిర్వహించారు. ఆదివారం కిమ్స్ సవీరా ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలోని సప్తగిరి సర్కిల్లోని అలెగ్జాండర్ లగ్జరీ హెూటల్లో నిర్వహించిన ఈ సదస్సును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "లంగ్ టాక్స్" సదస్సుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సదస్సును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.వైద్యులు వారి విధి నిర్వహణతోపాటు సేవాభావంతో కూడా పనిచేయాలని, మారుమూల ప్రాంతాల్లోని వారికి వైద్య సేవలు అందించాలన్నారు.సాధారణంగా ఊపిరితిత్తుల సమస్యలు వచ్చాయంటే హైదరాబాద్ లేదా బెంగళూరుకే చికిత్సల కోసం వెళ్తారని, కానీ ఆయా నగరాలకు దీటుగా రాయలసీమలోని అనంతపురంలో కూడా అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని ఈ సదస్సు ద్వారా వైద్యులకు కూడా తెలియజేశారు. ఈ సదస్సులో ప్రధానంగా ఊపిరితిత్తుల్లో వచ్చే పలు రకాల సమస్యలు, వాటికి నిర్ధారణ పరీక్షలు, చికిత్సా విధానాలపై ఇందులో విస్తృతంగా చర్చించారు. ఇంటర్స్టిషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్డీ), క్షయ (టీబీ), ఊపిరితిత్తుల క్యాన్సర్లు తదితర సమస్యలు ఎందుకు వస్తాయి, వాటి నిర్ధారణకు ఎలాంటి పరీక్షలు ఉన్నాయనే అంశంపై జనరల్ ఫిజిషియన్లు, పల్మనాలజిస్టులు, ఎనస్థీషియాలజిస్టులు, క్రిటికల్ కేర్ విభాగం నిపుణులు, పీజీ విద్యార్థులు తదితరులకు అవగాహన కల్పించారు. ఇలాంటి సంక్లిష్టమైన సమస్యలు ఉన్నప్పుడు ఊపిరితిత్తులు బాగా దెబ్బతింటే వెంటిలేటర్ అమర్చడంలో ఆధునిక విధానాలు, ఎక్మో ఎప్పుడు, ఎలా ఎన్నాళ్లు ఉపయోగించాలనే విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, కిమ్స్ సవీరా ఆస్పత్రి ఎండీ ఎస్వీ కిశోర్రెడ్డిల మార్గదర్శకత్వంలో ఈ సదస్సు జరిగింది. హైదరాబాద్లోకి కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ పల్మనాలజిస్టు డాక్టర్ ఎస్.శుభకర్, కిమ్స్ సవీరా ఆస్పత్రికి చెందిన డాక్టర్ యశోవర్ధన్ మంగిశెట్టి, డాక్టర్ రవిశంకర్ తదితరులు వివిధ వైద్యవిధానాలు, ఊపిరితిత్తుల సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పలువురు వైద్యులు, వైద్యవిద్యార్థులు, పీజీ విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

వ్యాయామ ఉపాధ్యాయులు అతని కూతురుకు సంతాప సభ

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పట్టణానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ ఇటీవల పెనుకొండ సమీపంలో గుట్టూరు వద్ద జరిగిన ప్రమాదంలో రమేష్ తో పాటు అతని కూతురు సాయి భవిత ఆకస్మిక మరణానికి చింతిస్తూ వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఆదివారం రోజున సంతాప సభ ధర్మవరం పట్టణంలో కాలేజీ గ్రౌండ్ మైదానంలో బాస్కెట్బాల్ ఆవరణంలో యుటిఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992 - 1993 రమేష్ తో పాటు చదువుకున్న 10వ తరగతి బ్యాచ్ మిత్ర బృందం, సహచర వ్యాయామ ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బాస్కెట్బాల్, ఫుట్ బాల్ , క్రికెట్ క్రీడాకారులు, హాజరై వారి చిత్ర పటాలకు పుష్ప మాలలతో నివాళులు అర్పించడం జరిగిందన్నారు.తమ సానుభూతిని కుటుంబ సభ్యులకు తెలియజేసి, భవిష్యత్తులో రమేష్ కుటుంబ సభ్యులకు అండదండలుగా ఉంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, వెంకట కిషోర్, శ్రీనివాసులు, నారాయణస్వామి, బాస్కెట్బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హి దయ తుల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు ఓబులేసు, ఆకులేటి రమేష్, రఘునాథ్ రావు, నాగేంద్ర, శివ కృష్ణ, గోవిందు, రమేష్, 1992 ..1993 మిత్ర బృందం రాయపాటి రామకృష్ణ, జయం రాఘవ, కేశగాల్ల రంజిత్ కుమార్, సాకే రవికుమార్, అన్నం మల్లికార్జున, జింక గిరి, స్టూడియో రామ్మోహన్ , గోల్డ్ హిద్దు,బొగ్గు వెంకటేష్, బిల్లే ప్రసాద్, మైఖేల్, దామోదర్, బాబా, మల్లికార్జున, కపాడం శ్రీనివాసులు, గుర్రం రామాంజనేయులు, రమణారెడ్డి, రామచంద్ర, హాకీ కోచ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చెయ్యండి

విశాలాంధ్ర-ఉరవకొండ : యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో జరుగుతాయని వీటిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప తెలిపారు. ఆదివారం ఉరవకొండలో స్వర్ణోత్సవ మండల మహాసభలను నిర్వహించారు. స్థానిక సివివి నగర్ కాలనీలో యుటిఎఫ్ కార్యాలయం ముందు మహాసభలకు సంబంధించిన ఎస్టిఎఫ్ జెండాను ఉపాధ్యాయ సంఘం సీనియర్ నాయకులు ఎం.సుధాకర్ యుటిఎఫ్ జెండాను బి.సంజీవప్ప ఆవిష్కరించగా స్వర్ణోత్సవ ప్రచార ర్యాలీని పట్టణంలో నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన మహాసభలను ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ మహాసభలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించి, సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాట కర్తవ్యాలను రూపొందించనున్నామని పేర్కొన్నారు. పాలక వర్గాలు ప్రభుత్వ విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యపరుస్తూ విద్యను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఎన్నికలకు ముందు పాలకులు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై హామీలు ఇస్తున్నారు తప్ప పరిష్కారంలో చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. పి ఆర్ సి ని ప్రకటించి ఐఆర్ ఇవ్వాలని, 117జీవో రద్దు చేయాలని, ఓపిఎస్ విధానం తీసుకురావాలని వీటిపై చర్చించి సమస్యల సాధన కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్మించేందుకు ఈ మహాసభలను వేదికగా చేసుకోబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోవిందప్ప,ఉపాధ్యక్షులు రామప్ప చౌదరి, జిల్లా కార్యదర్శి సంజీవ్ కుమార్, శేఖర్ వీరితోపాటు ఉరవకొండ వజ్రకరూరు విడపనకల్లు మండలాలకు చెందిన పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు జిల్లా నాయకులు తెలిపారు.

పంచాయితీల ఆదాయం పెంచుకోండి

విశాలాంధ్ర - రాప్తాడు : దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు. ఆర్థిక పరిపుష్టత వృద్ధి చెందితేనే సంపూర్ణ అభివృద్ధి చెందుతాయని నాడు జాతిపిత మహాత్మాగాంధీ అన్నారు. జిల్లాలో 1001పంచాయతీలు ఉండగా గత ఐదేళ్లుగా నిధులలేమితో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధుల మంజూరుకు మార్గం సుగమమయింది. ఈ నేపథ్యంలో కేవలం ప్రభుత్వం మంజూరు చేసే నిధులు పైనే ఆధారపడకుండా సొంత వనరులను సమకూర్చుకునేందుకు ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు ప్రయత్నించాలి. ప్రస్తుతం పంచాయతీల్లో అపరిశుభ్రత, మౌలిక వసతులలేమితో సతమతమవుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి తగినన్ని నిధులు లేవని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు నిత్యం చెబుతున్న మాట. రాప్తాడు ఎంపీడీఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి.విజయలక్ష్మిని రాప్తాడు విశాలాంధ్ర విలేకరి కమ్మూరు శీనా పలకరించగా వనరుల సమీకరణ పై ముఖ్య విషయాలను వివరించారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా పంచాయతీకి ఉన్న అధికారాలను వినియోగించుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకునే మార్గాలను పంచాయతీరాజ్ చట్టం ఎన్నో అవకాశాలను కూడా కల్పించిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు తీరాలంటే స్వయం ఆదాయంపై దృష్టి సారించాల్సి ఉంది అని తెలిపారు.

మెస్ చార్జీలను విడుదల చేయాలి

విశాలాంధ్ర-కణేకల్లు : పీ.డీ.ఎస్.యూ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్,రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఎస్సి,బీసీ ఎస్టీ మైనారిటీ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు గత ఆరు నెలలుగా పెండింగ్లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కణేకల్ పట్టణంలో పత్రిక సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వసతు గృహాలు 2733 ఉన్నాయి. వీటిలో మూడు లక్షల 13,695 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు పూర్తి కావస్తున్న వీరికి ప్రభుత్వం నుంచి రావాల్సిన మెస్ చ్చార్జీలు నేటి వరకు విడుదల కాలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుంతున్న నేపథ్యంలో, నెల నెల ప్రభుత్వం నుంచి రావాల్సిన మెస్ బిల్లులు విడుదల కాకపోవడంతో ప్రతి నెలా అప్పులు చేసి హాస్టల్స్ నిర్వహించడం వార్డెన్లకు భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గత విద్యా సంవత్సరం మూడు నెలల వరకు కొన్ని హాస్టల్స్ కు బిల్లులు విడుదల కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం చలికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో హాస్టల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి బెడ్ సీట్లు, మూడు జతల యూనిఫాము, ప్లేట్లు పెట్టెలు, బకెట్లు,జెగ్గులు కూడా అందించాలని, హాస్టల్ ల నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పక్కా రాష్ట్రం తెలంగాణలో లాగా ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు 2500 మిస్ చార్జీలు పెంచి గత ఆరు నెలలుగా పెండింగ్ లో ఉన్న మెస్ బిల్లు వెంటనే విడుదల చేసి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు అప్పుల బాధలనుండి ఉపశమనం కల్పించాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్ కణేకల్ మండలం అధ్యక్షులు బాబా పక్రుద్దీన్, పీడీఎస్యూ నాయకులు ఖాజాపీర్, కార్తీక్, అనిల్, భీమేష్, అబ్బాస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ స్థూపం ఆవిష్కరణ

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని చెలిమి రోడ్డు వద్ద గల సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో చెలిమి జీర్నోద్ ధారణ సంగం ఆధ్వర్యంలో కార్తీకదీపం తో పాటు ద్వాదశ జ్యోతిర్లింగ స్థూపం యొక్క ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు భక్తాంజనేయ స్వామి వారి సన్నిధానమున నిర్వహిస్తున్నట్లు చెలిమి జీర్ణో ధారణ సంఘము సీతారామాంజనేయ స్వామి మహిళా మండలి వారు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 25న గణపతి పూజ,గంగా, శివ, గంగ హారతి, గంగాభవాని విశేష పూజల కార్యక్రమంతో పాటు కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధర్మారం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రులు సత్త కుమార్ యాదవ్, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలక్క మధుసూదన్ రెడ్డి, పర్సనల్ సెక్రెటరీ ఉపముఖ్యమంత్రి ఆంధ్ర ప్రదేశ్ మధుసూదన్,ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తదితరులు హాజరవుతున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమం అర్చకులు మోహన్ స్వామి చంద్రమౌళి స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు సచివాలయాల వద్ద నిరసన

విశాలాంధ్ర-లేపాక్షి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ గ్రామాలలో మూడు సెంట్లు పట్నాలలో రెండు సెంట్లు ఇంటి స్థలం పంపిణీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి శివప్ప ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. సోమవారం ఉదయం లేపాక్షి మండలంలోని సచివాలయాల వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేసి పేదల తరఫున అర్జీలు ఇవ్వడం జరుగుతుందని సిపిఐ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి సహాయ కార్యదర్శి గౌతం కుమార్ గోవిందప్ప గుల్జర్ రోజా తదితరులు పాల్గొన్నారు.

గంగన్న మృతికి నివాళులర్పించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర - లేపాక్షి : గత పది రోజుల క్రితం మృతి చెందిన సీనియర్ నాయకుడు సిపిఐ గంగన్నకు ఆదివారం ఉదయం ఆయన పెద్దకర్మ కావడ ంతో మండల కార్యదర్శి శివప్ప సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి సహాయ కార్యదర్శి గౌతం కుమార్ ఆయన సమాధి వద్ద పూజలు నిర్వహించి ఘనంగా పార్టీ తరఫున నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారునికి ప్రభుత్వం తరఫున పక్కా ఇల్లు ఏర్పాటు చేసే విధంగా పార్టీ కృషి చేస్తుందని హామీ ఇచ్చి ధైర్యం చెప్పారు.

సీపీఐ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు అర్జీలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ తాహసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఇంటి పట్టాలు లేని నిరుపేదల కోసం కూటమి ప్రభుత్వం ఎన్నికలలో హామీలలో భాగంగా పట్టణాలలో 2 సెంట్లు పల్లెలలో 3 సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందజే స్తామని తెలపడంతో సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో తాహసిల్దార్‌కి ఇల్లు లేని నిరుపేదలు తమ యొక్క అర్జీలు ఇవ్వబోతున్నామని శ్రీరాములు తెలిపారు.

వాల్మీకి సోదరులు మంత్రికు సన్మానం

విశాలాంధ్ర- పెనుకొండ : పెనుకొండ మంత్రి క్యాంపు కార్యాలయం నందు రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన సోమందేపల్లి మండలానికి చెందిన డి.వి ఆంజనేయులు ,వాల్మీకి సోదరులు కలిసి రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ ను స్వీట్లు ఇచ్చి కలిసి సన్మానించారు, వాల్మీకి సోదరులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పెనుకొండ నియోజకవర్గంలో వాల్మీకులకు ఎంతో ఉన్నతమైన పదవులు ఇస్తున్నందున అలాగే వాల్మీకులను గుర్తించి వారికి రాజకీయంగా ప్రోత్సహిస్తున్నందున మంత్రి సవితమ్మ రుణపడి ఉంటామని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో వాల్మీకి కులస్తులు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు అనారోగ్యంతో మృతి

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: చిలమత్తూరు మండలం వీరాపురం పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఐ టి డి పి పంచాయతీ ఇంచార్జ్ ఆదినారాయణ ఆదివారం అనారోగ్య కారణం వల్ల బెంగళూరు బాప్టిస్ట్ హాస్పిటల్ నందు ఈరోజు సాయంత్రం 5.30 గంటల సమయంలో మృతి చెందినాడు. దీంతో టిడిపి శ్రేణులలో తీరని లోటు ఏర్పడింది, పార్టీలో ఎంతో ఎదగాల్సిన ఆయన చిన్న వయసులో మృతి చెందడంతో పార్టీ సభ్యులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.